నేడు మంత్రివర్గ విస్తరణ

- బిసి, ఎస్సి, రెడ్డి సామాజిక తరగతికి ప్రాధాన్యం
- కీలక శాఖలను వదులుకోనున్న సిఎం రేవంత్
- మంత్రి పదవిని ఆశిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్?

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్టానం ఆమోదం తెలిపింది. దీంతో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఫిక్స్ అయింది. నేడు (ఆదివారం సాయంత్రం)లేదా బుధవారం రాజ్‌భవన్‌లో వారు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు రాజ్‌భవన్‌కు ప్రభుత్వం సమాచారమందించినట్టు తెలిసింది. ఖాళీగా ఉన్న ఆరుగురు మంత్రులను భర్తీ చేయకపోవడంతో అసమ్మతి పెరిగిన నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణకు సిఎం ముహూర్తం ఖరారు చేసినట్టు సమాచారం. పోటీ ఎక్కువగా ఉన్న జిల్లాలను పక్కనపెట్టి తక్కువగా ఉన్న జిల్లాల నుంచి ముగ్గురు లేదా నలుగురిని మంత్రివర్గంలోకి తీసుకోనున్నారు. అందులో బిసి, ఎస్సి, రెడ్డి సామాజిక తరగతులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అందులో కూడా ఏ జిల్లాకు ప్రాతినిధ్యం లేదో అక్కడి నుంచి మంత్రి పదవులు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది.

ప్రాతినిధ్యం లేని జిల్లాలకు ప్రాధాన్యత

ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మంత్రుల ప్రాతినిధ్యం లేదు. అందులోనూ ఉమ్మడి మహబూబ్‌నగర్ లాంటి పెద్ద జిల్లా నుంచి సిఎం రేవంత్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఖమ్మం నుంచి మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, నల్లగొండ జిల్లా నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కరీంనగర్ నుంచి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, వరంగల్ నుంచి కొండా సురేఖ, సీతక్కకు ప్రాతినిధ్యం లభించింది. అయితే సిఎంను మినహాయిస్తే మహబూబ్‌నగర్ నుంచి ఒకరే మంత్రి ఉండటంతో అక్కడికి నుంచి బిసి సామాజిక తరగతికి చెందిన వాకిటి శ్రీహరి ముదిరాజ్ పేరు బలంగా వినిపిస్తున్నది. ఆదిలాబాద్ నుంచి జి.వివేక్ వెంకటస్వామి, ప్రేమ్‌సాగర్‌రావు పేర్లు వినిపిస్తున్నా... వివేక్ వైపే సిఎం మొగ్గు చూపే అవకాశం ఉందని సమాచారం. నిజామాబాద్ జిల్లా నుంచి పి.సుదర్శన్‌రెడ్డి ఖాయంగా కనిపిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలకు చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా మంత్రి పదవి ఆశిస్తున్నట్టు సమాచారం. ఆయన ప్రతిపాదనకు సిఎం సానుకూలంగా ఉన్నా...సామాజిక సమీకరణాలు కుదరకపోవడంతో ఆయనకు అవకాశం లేదని పార్టీ వర్గాలు అంటున్నాయి. జనాభా ప్రాతిపదికగా మాదిగ సామాజిక తరగతికి మరో మంత్రి పదవి కావాలంటూ ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్, కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామేల్, వేముల వీరేశం, కాలే యాదయ్య తదితరులు సిఎంను కలిసి కోరారు. అధిష్టానాన్ని కలిసి వారు విజ్ఞప్తి చేశారు. నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా బలంగా ఆశిస్తున్నప్పటికీ ఇప్పటికే ఇద్దరు మంత్రులు అక్కడి నుంచి అదే సామాజికతరగతికి చెందిన వారు ఉన్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. సీనియర్ నేత జానారెడ్డి కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నట్టు తెలిసింది. గ్రేటర్ హైదరాబాద్ కంటోన్మెంట్ నుంచి కాంగ్రెస్ గెలిచినప్పటికీ సామాజిక సమీకరణాల్లో ఆయన దక్కే అవకాశం లేదు. దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరినా, సుప్రీంకోర్టులో కేసు ఉండటంతో సిఎం ఆయనకు ఇచ్చే సహసం చేయకపోవచ్చు అన్న చర్చ నడుస్తున్నది. గడ్డం ప్రసాద్‌కు ప్రాతినిధ్యం కల్పించి గ్రేటర్‌కు ఉపయోగించుకోవాలని సిఎం ఆలోచనగా ఉన్నట్టు సమాచారం. మంత్రివర్గంలో ఎస్‌టిలకు ప్రాతినిధ్యం కల్పించాల్సి వస్తే ఎమ్మెల్యే బాలూ నాయక్, ఎస్‌టి కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే బెల్లయ్య నాయక్ ఎమ్మెల్సీగా లేకపోవడంతో బాలూ నాయక్ ఉండే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఇటీవల ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ అయినా విజయశాంతి కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. అందులోనూ హోంమంత్రి కావాలని ఆమె కోరుతున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



మాదిగ సామాజిక తరగతికి అవకాశం కల్పించిన సిఎంను కలిసిన పలువురు ఎమ్మెల్యేలు

శాఖల మార్పులు

ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రుల శాఖలను మార్చాలని సిఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. సిఎం వద్ద ఉన్న కీలక శాఖలను వదులుకుని ఇతరులకు అప్పగించనున్నారు. హోం, విద్యాశాఖ, మున్సిపల్, జిఎడి, క్రీడలు, ఎస్‌టి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమం తదితర శాఖలు సిఎం దగ్గరే ఉన్నాయి. అందులో కొన్ని శాఖలను కొత్త మంత్రులకు అప్పగించనున్నారు. ప్రస్తుతం ఉన్న మంత్రుల పోర్ట్‌పోలియోలు మారనున్నట్టు సమాచారం. కీలక శాఖలు నిర్వహిస్తున్న మంత్రులు కూడా కొన్ని శాఖలు తమకు వద్దని చెబుతున్నట్టు ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తన ఢిల్లీ పయనాన్ని వాయిదా వేసుకున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

రాజీవ్ స్వగృహ ప్లాట్ల వేలానికి కసరత్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రాజీవ్ స్వగృహ - హౌసింగ్ బోర్డు ఫ్లాట్లు, స్థలాలు విక్రయంపై సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి అవసరమైన నిధుల సమీకరణలో భాగంగా పలు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాలు, ప్లాట్లు బహిరంగ వేలం వేయాలని హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ సంస్థలు నిర్ణయించాయి. ఇందుకు సంబంధించి గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్, హౌసింగ్ బోర్డు కమిషనర్ వీపీ గౌతం సిద్ధం చేసిన ప్రతిపాదనలకు వనరుల సమీకరణపై ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ఈనెల 20వ తేదీ నాటికి ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయాలని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో పలు జిల్లాల్లోని 11 ప్రాంతాల్లో ఇప్పటికే పూర్తయి, పాక్షికంగా పూర్తయిన అపార్ట్ మెంట్ల ఫ్లాట్లతో పాటు, ఓపెన్ ప్లాట్లు, హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో నాలుగు ప్రాంతాల్లోని ఓపెన్ ప్లాట్లు, ఖాళీ స్థలాలు బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. ఎటువంటి వివాదాలు లేని భూములు, మంచి అందుబాటులో ఉండే సరసమైన ధరలతో నిర్మించిన అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్లు కొనుగోలు చేసుకునేందుకు ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని గృహ నిర్మాణ సంస్థ కమిషనర్ గౌతం విజ్ఞప్తి చేశారు.

నేడు, రేపు ఐసెట్ పరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్ రాతపరీక్షలు ఆది, సోమవారం రెండురోజులపాటు జరగనున్నాయి. ఐసెట్‌కు 34,409 మంది అబ్బాయిలు, 37,331 మంది అమ్మాయిలు కలిపి మొత్తం 71,757 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారి కోసం రాష్ట్రవ్యాప్తంగా 16 జోన్లలో 96 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులందరూ https://icet.tsche.ac.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు సూచించారు. హాల్‌టికెట్ల పై క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. దాని ద్వారా పరీక్షా కేంద్రం దూరాన్ని, ఇంటి నుంచి ఎంత సమయంలో వెళ్లొచ్చో తెలుసుకోవచ్చు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- సిపిఎం, సిపిఐ నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, దేశంలో జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్‌లను ప్రజలు ఖండించాలని సిపిఎం, సిపిఐ నేతలు డిమాండ్ చేశారు. మావోయిస్టుల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి, బూటకపు ఎన్‌కౌంటర్‌లకు నిరసనగా శనివారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో నల్ల జెండాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి, సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మావోయిస్టులను హతమార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టు పార్టీని నిర్మూలిస్తామంటూ డెడ్‌లైన్ విధించడం పాలకుల రాక్షసత్వానికి నిదర్శనమన్నారు. ఉగ్రవాదులు దేశంపై దాడి చేసి అమాయక ప్రజలను చంపితే.. పాకిస్థాన్‌తో చర్చలు జరిపిన కేంద్రం.. మన దేశంలో పేద ప్రజల కోసం, సమానత్వం కోసం, అసమానతల పట్ల పోరాటం చేస్తున్న మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్టులతో చర్చలు జరపాలని, లేకుంటే వామపక్షాల ఆధ్వర్యంలో రానున్న కాలంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుడికందుల సత్యం, గీట్ల ముకుంద రెడ్డి, సిపిఐ, సిపిఎం నాయకులు కిన్నెర మల్లమ్మ, పైడిపల్లి రాజు, కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, ఎడ్ల రమేష్, కోనేటి నాగమణి, మచ్చ రమేష్ బ్రాహ్మణపల్లి యుగంధర్, కొట్టే అంజలి, జి.తిరుపతి, గజ్జల శ్రీకాంత్, కాంపల్లి అరవింద్, సత్తయ్య, సిహెచ్ మురళి, నగునూరు రమేష్, గాజుల కనకరాజు, కోంపల్లి సాగర్, తిరుమలయ్య, పవన్ కండిరాజు, సందేశ్, అక్షయ్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం , సిపిఐ నేతలు

మూసీ నది ప్రక్షాళన

- పరివాహక ప్రాంతానికి గోదావరి జలాలు అందించాలి
- చెరుపల్లి సీతారాములు డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూసీ నది ప్రక్షాళన చేసి, ఆ పరివాహక ప్రాంతానికి గోదావరి జలాలు అందించాలని సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని మేకల లింగయ్య స్మారక భవనంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ ప్రక్షాళన కోసం రూ.1,50,000 కోట్లు కేటాయించి, మూసీ సుందరీకరణ పనుల పేరుతో కాకుండా కాలుష్యం నివారణకు కృషి చేసి, గోదావరి జలాలను అందించాలని కోరారు. రామన్నపేటలో అదానీ గ్రూప్ అంబుజా సిమెంట్ కంపెనీని ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకించి, నిరసనలు వ్యక్తం చేశారని, కానీ ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు దానిపై ఎలాంటి ప్రకటనా రాలేదని తెలిపారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలైన ఆసరా పింఛన్ రూ.4000, ప్రతి మహిళకూ నెలకు రూ.2500 అమలు చేయడం లేదన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు వేగవంతం చేయాలని కోరారు. ఎస్ఎల్‌బిసి ప్రమాదంతో సొరంగం పనులు పెండింగ్‌లో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, నాయకులు ఐతరాజు యాదయ్య, బొబ్బిలి సుధాకర్ రెడ్డి, జిట్ట స్వామి, కృష్ణ ఉన్నారు.



విలేకర్ల సమావేశంలో చెరుపల్లి సీతారాములు

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై కఠిన చర్యలు

- నిర్వహణ బాధ్యత విద్యాసంస్థల యాజమాన్యాలదే..
- జాయింట్ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఈ నెల 12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులను రవాణా చేసే విద్యాసంస్థల వాహనాలు తప్పనిసరిగా ఫిట్‌నెస్ కలిగి ఉండాలని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 25,677 విద్యాసంస్థల బస్సులు ఉంటే ఇప్పటి వరకు 17,020 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాయని, మిగిలిన 8657 బస్సులు సంబంధిత రవాణా శాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని చెప్పారు. 15 ఏళ్లు దాటిన బస్సులు ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్లపై తిరగరాదన్నారు. 15 ఏళ్లు దాటిన బస్సులు విద్యార్థులను రవాణా చేస్తే సీజ్ చేసి యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యాసంస్థల వాహనాల నిర్వహణ బాధ్యత ఆయా యాజమాన్యాలదే అన్నారు. బస్సును మంచి కండిషన్‌లో ఉంచడంతోపాటు అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించుకోవాలని సూచించారు. పరిమితికి మించి విద్యార్థులను తీసుకొని వెళ్లే వాహనాలను తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని అన్ని జిల్లాల రవాణా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. ఆయా జిల్లాల్లో జిల్లా రవాణా శాఖ అధికారులు విద్యాసంస్థల యాజమాన్యాలతో, డ్రైవర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

సిఒఇ విద్యార్థులకు పాత పద్ధతినే కొనసాగించాలి

- 95 శాతం మార్కుల నిబంధనను తొలగించాలి
- సిఎం రేవంత్‌రెడ్డికి జాన్‌వెస్లీ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గౌలిదొడ్డి, అలుగునూరు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ)ల్లో చదివిన ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 95 శాతం మార్కులొస్తేనే కొనసాగిస్తామనే నిబంధనను తొలగించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న మాదిరిగానే ఇంటర్ ద్వితీయ సంవత్సరంలోకి విద్యార్థులను అనుమతించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డికి ఆయన శనివారం లేఖ రాశారు. రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన గౌలిదొడ్డి, అలుగునూరు గురుకుల కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 2024 ఫిబ్రవరి నాలుగు, ఫిబ్రవరి 25న జరిగిన గురుకులాల సిఒఇ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. దాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఐపిఇ-2025 మార్చిలో జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలో 95 శాతం మార్కులు వస్తేనే ఈ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరంలో కొనసాగిస్తామని, లేకుంటే వేరే చోటకు తరలిస్తామని చెప్పడం సరైంది కాదని పేర్కొన్నారు. విద్యార్థులు కళాశాలల్లో చేరే సమయంలో ఈ నిబంధన లేదని వివరించారు. ప్రస్తుతం కళాశాలకు వస్తున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు భోజనాలు పెట్టకుండా తిరిగి ఇంటికి పంపుతున్నారని తెలిపారు. ఇప్పటికే కొంతమండి బైపిసి విద్యార్థులను ఏ సౌకర్యాలు లేని చోటకు తరలించారని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ప్రోత్సాహంతో చదువుతున్న దళిత, మైనార్టీ, వెనకబడిన తరగతుల విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమౌతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా దాదాపు పదో తరగతిలో పది జిపిఎ సాధించినవారేనని గుర్తు చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం మార్కుల వల్ల పెద్ద ఉపయోగం లేకపోవడంతో డాక్టరో, ఇంజినీరో కావాలనే లక్ష్యంతో నీట్, ఐఐటీ సాధించడంపైనే దృష్టి పెడతారని తెలిపారు. యాజమాన్యంతోపాటు, అధ్యాపకులు కూడా ఇంటర్ మార్కులపై దృష్టి సారించకుండా నీట్, ఐఐటి లక్ష్యంతోనే బోధిస్తారని గుర్తు చేశారు. కాబట్టి సిఒఇ పరీక్ష ద్వారా రెండు విడతలుగా ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులై ప్రవేశాలు పొందిన ఈ విద్యార్థులకు ఇంటర్ మొదటి సంవత్సరం మార్కులతో ముడిపెట్టి ద్వితీయ సంవత్సరం చదవనీయకుండా బయటకు పంపడం సమంజసం కాదని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులతో తక్షణమే చర్చలు జరపడంతో పాటు, గతంలో ఉన్న మాదిరిగానే ఈ కళాశాలల్లో విద్యా విధానాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

జిఒ 49 రద్దుకు కదిలిన ఆదివాసులు

- ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదివాసుల హక్కులను కాలరాసి అటవీ ప్రాంతం నుంచి వెళ్లగొట్టేలా పులుల రక్షణ కోసం తీసుకొచ్చిన జీవో నెంబర్ 49ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ ఆధ్వర్యంలో శనివారం కుమురంభీం - ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో భారీ నిరసన చేపట్టారు. అన్ని ప్రాంతాల నుంచి ఆదివాసులు పెద్దఎత్తున తరలొచ్చారు. జిల్లా నాయకులతో పాటు వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు మద్దతు తెలిపారు. పులుల కారిడార్ కవ్వాల్ అభయారణ్యంలో భాగంగా ఉన్న ఆసిఫాబాద్ ప్రాంతాన్ని కుమురంభీమ్ పులుల కన్జర్వేషన్ రిజర్వ్‌గా మారుస్తూ గత నెల 30న ప్రిన్సిపల్ సెక్రెటరీ అహ్మద్ నదీమ్ జీవో నెంబర్ 49 విడుదల చేశారు. ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్, కర్జల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ రేంజ్‌లలో లక్షా49వేల హెక్టార్లను టైగర్ రిజర్వ్‌లోకి మారుస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. జీవో విడుదల కోసం 339 గ్రామాల ప్రజలతో చర్చించినట్టు జీవోలో పేర్కొన్నారు. దీన్ని నిరసిస్తూ ఆదివాసీ సంఘం తుడుందెబ్బ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివాసులు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ముందుగా కుమురం భీమ్ విగ్రహానికి పూల మాల వేసి డప్పు చప్పుల మధ్య ర్యాలీ సాగింది. అంబేద్కర్ చౌక్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు కొట్నాక్ విజయ్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బుర్స పోచయ్య, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బిఆర్ఎస్ సిర్పూర్ ఇన్‌చార్జి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్రీవ్స్ ఎలక్ట్రిక్ కొత్త యాంపియర్ డీలర్‌షిప్ ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్

గ్రీవ్స్ కాటన్ లిమిటెడ్ ఇ-మొబిలిటీ విభాగం అయిన గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ (జిఇఎంఎల్) సంస్థ హైదరాబాద్‌లో ప్రగతి మోటో ఉప్పల్ అనే కొత్త యాంపియర్ డీలర్‌ను నియమించుకున్నట్లు ప్రకటించింది. దీంతోపాటు పలువురు వినియోగదారులకు ఎలక్ట్రిక్ స్కూటర్లను అందజేసినట్లు పేర్కొంది. ఇక్కడ యాంపియర్ నెక్సస్‌ను ప్రదర్శించారు. "యాంపియర్ సంస్థ 17 సంవత్సరాల పయనం భారతదేశానికి ఆధారపడదగిన, స్వచ్ఛమైన, సమ్మిళిత మొబిలిటీ పరిష్కారాలను అందించడంలో మా నిబద్ధతను ప్రదర్శిస్తుంది" అని గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు.



మల్టీనేషనల్ కంపెనీలతో రైతు ఆగం

- ప్రయివేట్ కంపెనీల ప్రచారాలతో మోసపోవద్దు
- వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మల్టీనేషనల్ కంపెనీల వల్ల రైతులు ఆగమౌతున్నారని, రైతులు ఆలోచన చేసి మేలైన విత్తనాలు వాడాలని వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి చెప్పారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో శనివారం రెండోరోజు జరిగిన రైతు మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం రైతుల సమావేశంలో మాట్లాడుతూ.. రైతు బిడ్డ సిఎం రేవంత్‌రెడ్డి అని, ఆయన ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి రైతుల కోసం ఆలోచన చేస్తున్నారని అన్నారు. నకిలీ సీడ్ వల్లే రైతులు నష్టపోతున్నారని, అందుకే రైతుకు విత్తన హక్కును కల్పించే దిశగా విత్తన చట్టం తీసుకురాబోతున్నారన్నారు. ములుగులో కొన్ని మల్టీనేషనల్ కంపెనీలు మొక్కజొన్న విత్తనోత్పత్తి చేసి రైతులను ఆగం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ములుగు ఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందన్నారు. త్వరలో విత్తన చట్టం తీసుకురావాలని నిర్ణయం తీసుకొని కమిటీ వేసినట్టు చెప్పారు. ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరామన్నారు. ఆనాడు వైఎస్ రుణమాఫీ చేస్తే, ఇప్పుడు రేవంత్‌రెడ్డి మళ్లీ రైతు రుణ మాఫీ చేసి చరిత్రలో నిలిచారన్నారు.

ప్రయివేటు కంపెనీల ప్రచారాలను నమ్మి రైతులు మోసపోవద్దని, సీడ్ కార్పొరేషన్ ఇచ్చే విత్తనాలే తీసుకోవాలని సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి చెప్పారు. రైతులు యంత్ర పరికరాలపై అవగాహన కల్పించుకోని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెస్టిసైడ్ వాడకుండానే చాలామంది రైతులు అధిక దిగుబడి సాధిస్తున్నారని తెలిపారు. సీడ్ కార్పొరేషన్ ద్వారా రైతులకు మేలైన విత్తనాలు అందిస్తున్నామన్నారు. సీడ్ కార్పొరేషన్, యూనివర్సిటీ ద్వారా వచ్చే విత్తనాలు ఈ స్టాల్స్‌లో ఉంచామన్నారు. తాను ఒక రైతుగా చెబుతున్నానని, పంట మార్పిడి చేసి అధిక దిగుబడి సాధించాలని సూచించారు.

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు తీసుకురావడానికే ఈ రైతు మహోత్సవం నిర్వహిస్తున్నట్టు జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. రైతులకు అధికారులు ప్రతి అంశంపైనా అవగాహన కల్పిస్తున్నారన్నారు. రెండ్రోజుల్లో పదివేల మంది రైతులు హాజరయ్యారని తెలిపారు. 150 స్టాల్స్‌లో వ్యవసాయ పరికరాలు ఉన్నాయని చెప్పారు. బ్యాంకుల స్టాల్స్ కూడా ఉన్నాయని, ఎవరైనా ఇఎంఐ కింద రుణాలు పొంది యంత్రాలు తీసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి, భవానీ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ ఆర్‌డిఒ రామ్మూర్తి, ఎఎంసి చైర్మన్‌లు, సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, పశు సంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు.



రైతు మహోత్సవంలో మాట్లాడుతున్న కోదండరెడ్డి

కాళేశ్వరం కమిషన్ ఎదుట ఈటల తప్పుడు వాంగ్మూలం

- నన్ను వివాదంలోకి లాగేందుకు ప్రయత్నిస్తున్నారు
- ప్రాజెక్ట్ అనుమతి అంశం క్యాబినెట్లో ఎప్పుడూ చర్చించలేదు
- అన్ని విషయాలు కమిషన్‌కు లిఖిత పూర్వకంగా అందజేస్తాను : మంత్రి తుమ్మల



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కాళేశ్వరం కమిషన్ ముందు తప్పుడు వాంగ్మూలం ఇచ్చారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈటెల వ్యాఖ్యలను తప్పుపట్టారు. ఎవరిని రక్షించేందుకు ఆయన అబద్ధాలాడుతున్నారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. క్యాబినెట్ సబ్ కమిటీకి, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధం లేదని స్పష్టం చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చిన తర్వాత ప్రాణహిత, దేవాదుల, కాంతలపల్లి, తుపాకుల గూడెం పనుల కోసం సబ్ కమిటీ వేశారని మంత్రి తెలిపారు. కాళేశ్వరం నిర్మాణానికి సబ్ కమిటీ ఆమోదం తెలిపిందనడం అబద్ధమ ని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో తాను మంత్రిగా ఉన్న కాలంలో ప్రాజెక్ట్ అనుమతు లకు సంబంధించి క్యాబినెట్ సబ్‌కమిటిలో గాని, క్యాబినెట్లో గాని ఆమోదం పొందలేదని తుమ్మల స్పష్టం చేశారు. 'కాళేశ్వరం ఎప్పుడూ క్యాబినెట్ ముందుకు రాలేదు. పరిపాలన అనుమతులతోనే నిర్మాణ పనులు చేపట్టారు. ఈటల రాజేందర్ కమిషన్‌కు తప్పుడు సమాచారం ఇచ్చారు. కాళేశ్వరం కమిషన్ ముందు ఆయనకు అబద్ధాలు ఆడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది. తన పట్ల నాకు గౌరవం ఉంది. కానీ ప్రకటన చూసిన తర్వాత కొంత బాధేసింది. కమిషన్ వివాదంలోకి నన్ను ఎందుకు లాగాల్సి వచ్చిందో ఈటలే చెప్పాలి. తుమ్మల కూడ కాళేశ్వరం కోసం సబ్ కమిటీ రిపోర్ట్‌పై సంతకం చేశారని ఇచ్చిన వాగ్మూలం బాధాకరం. కాళేశ్వరం క్యాబినెట్ ఉమ్మడి నిర్ణయమని చెప్పడం సరికాదు. హరీశ్‌రావు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. వాస్తవాలు ప్రజలకు తెలియాలి. రాజకీయ లబ్ధికోసం నీచ రాజకీయాలకు పాల్పడటం సరికాదు. ఇప్పటికైనా ఈటల ఆత్మ విమర్శ చేసుకుని తెలంగాణ సమాజానికి వాస్తవాలు చెప్పాలి" అని తుమ్మల డిమాండ్ చేశారు. కొంతమంది పెద్దలను తప్పించేందకు బిఆర్ఎస్, బిజెపి నేతలు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిరుపయోగమని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్ఎ) ఇచ్చిన నివేదికను పక్కన పెట్టి బిఆర్ఎస్ సర్కార్ నిర్మాణానికి మొగ్గు చూపిందని ఆరోపించారు. మంత్రి మండలి సమావేశాల్లో పలు మార్లు అంతర్గతంగా తాను వాటితో విబేదించానని గుర్తు చేశారు. బీఆర్ఎస్ సర్కార్ ఏర్పాటు చేసిన

సబ్ కమిటీ కాళేశ్వరంపై నివేదిక ఇవ్వలేదని, అన్ని ఆధారాలతో సుమోటోగా కమిషన్‌కు అందజేస్తానని తుమ్మల తెలిపారు.

నగరంలో పిఅండ్ఎస్ కో తొలి స్టోర్ ఏర్పాటు



ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రీమియం కిడ్స్ ఎథ్నిక్‌వేర్ బ్రాండ్ పిఅండ్ఎస్ కో తెలంగాణలో తమ తొలి స్టోర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. బంజారాహిల్స్‌లోని జివికె మాల్‌లోని ఈ స్టోర్‌ను శనివారం గ్రాన్యూల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రియాంక చిగురుపాటి లాంచనంగా ప్రారంభించారు. దీన్ని లతా అగర్వాల్, అక్షిత నమార్ ఆధ్వర్యంలో రాపిడ్ కార్ప్ అనే మాస్టర్ ఫ్రాంచైజీ ద్వారా తెరిచారు.

జిహెచ్ఎంసి మేయర్‌కు బెదిరింపు కాల్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మికి ఫోన్ చేసి ఓ దుండగుడు వేధించాడు. అర్ధరాత్రి ఫోన్‌లు చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. మేయర్‌తో పాటు, ఆమె తండ్రి కేశవరావు అంతు చూస్తానంటూ వాయిస్ మెసేజ్‌లు పెట్టాడు. బోరబండలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన సర్దార్‌కి చెందిన వ్యక్తిగా చెప్పుకొచ్చాడు. అసభ్యకరమైన పదజాలంతో బెదిరిస్తున్నాడంటూ మేయర్ పిఆర్ఒ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కామారెడ్డి జిల్లాలో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలంలోని ఆరుగొండ గ్రామంలో జరిగింది. ఎస్ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జంగిటి పెంటయ్య (48)కు గ్రామ శివారులోని గెరికబాయి కుంట సమీపంలో 20 గుంటల వ్యవసాయ భూమి ఉంది. జొన్న పంట సాగుచేస్తే దిగుబడి సరిగా రాకపోవడంతో తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడికి లోనయ్యారు. అలాగే పెంటయ్య ఇద్దరు కుమార్తెల పెళ్లిళ్ల సమయంలోనూ అప్పు అయింది. అప్పుల బాధ భరించలేక తీవ్ర మనస్తాపానికి గురై శనివారం ఉదయం పంట పొలానికి వెళ్తున్నా అని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. తన పొలంలోనే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానిక రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రైతు భార్య జంగిటి రాజమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు కెటిఆర్ పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని ఎఐజి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ శనివారం పరామర్శించారు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైన ఎమ్మెల్యే గోపీనాథ్ ఎఐజి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందనే వార్తలు వినిపించాయి. 48 గంటలు ఆయనను అబ్జర్వ్‌లో పెట్టినట్టు వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న కెటిఆర్ అమెరికా పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చారు. ఇక్కడికి వచ్చి రాగానే శనివారం ఉదయం కెటిఆర్ ఎఐజి ఆస్పత్రికి వెళ్లారు. ఎమ్మెల్యే మాగంటిని పరామర్శించి, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

మహిళా ఎస్ఐపై దురుసు ప్రవర్తన


- పది మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విధి నిర్వహణలో ఉన్న కల్లూరు పోలీస్ స్టేషన్ మహిళా ఎస్ఐ హరితతో దురుసుగా ప్రవర్తించిన ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఖమ్మం జిల్లా తల్లాడ గ్రామానికి చెందిన రాయల రామారావుతోపాటు కొంతమంది యువకులు శుక్రవారం సాయంత్రం కల్లూరు పట్టణం ఎన్నెస్పీ క్రాస్ రోడ్డులోని చౌదరి హోటల్ వద్దకు వచ్చి తమకు పరోట కావాలని అడిగారు. ఆ సమయంలో వారు మద్యం మత్తులో ఉన్నారు. ఇంకా తయారు కాలేదని, ఇంకో గంట సమయం పడుతుందని చెప్పడంతో హోటల్ సిబ్బందిపై వారు దాడికి దిగారు. విషయాన్ని హోటల్ యజమాని మాగంటి బోసుబాబు కల్లూరు పోలీస్‌లకు సమాచారం అందించారు. కానిస్టేబుళ్లు వచ్చి గొడవ చేస్తున్నవారికి సర్దిచెప్పి పంపించారు. అనంతరం హోటల్ యజమాని స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. అయితే, రామారావు మళ్లీ మద్యం తాగి.. తల్లాడ మండలం నుంచి మరికొంత మందిని వెంట బెట్టుకుని ఏడు గంటల సమయంలో హోటల్‌కు వచ్చారు. ఈ విషయాన్ని ఎస్ఐ హరిత దృష్టికి తీసుకుపోయారు. ఆమె వెంటనే సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని ఎందుకు గొడవ చేస్తున్నారని అడిగారు. ఈ క్రమంలో రాయల రామారావు, అతని అనుచరులు అసభ్యంగా మాట్లాడుతూ మహిళా ఎస్ఐ పట్ల దురుసుగా ప్రవర్తించారు. దాంతో ఎస్ఐ హరిత రామారావుపై చెంప మీద కొట్టడంతో కోపోద్రిక్తుడైన రామారావు ఎస్ఐని నెట్టేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. హోటల్ యజమాని, కల్లూరు ఎస్ఐ ఫిర్యాదు మేరకు రామారావు, అతని అనుచరులపై వేరు వేరుగా కేసులు నమోదు చేశారు. మొత్తం పదిమందిపై కేసులు నమోదు కాగా ప్రధాన నిందితుడు రాయల రామారావుతో పాటు ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గతంలో రాయల రామారావుపై తల్లాడ పోలీస్ స్టేషన్‌లో కేసు ఉంది.

కాంగ్రెస్‌ది ముమ్మాటికీ దుష్ప్రచారమే..

- కాళేశ్వరంపై మాజీ మంత్రి హరీశ్‌రావు
- కమిషన్ విచారణకు హాజరవుతామని వెల్లడి
- ఎన్‌డిఎస్ఎ అనేది ఎన్‌డిఎ జేబు సంస్థంటూ ఎద్దేవా



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టుపై అధికార కాంగ్రెస్ దుష్ప్రచారానికి పాల్పడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. దాన్ని తిప్పికొడతామని వ్యాఖ్యానించారు. పిసి ఘోష్ కమిషన్ ఎదుట విచారణకు హాజరవుతామని, కాంగ్రెస్ తాటాకు చప్పుళ్లకు భయపడబోమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్వాపరాలపై హరీశ్‌రావు శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...మేడిగడ్డ బ్యారేజ్‌లో 86 పిల్లర్లలో రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కూలినట్టుగా కాంగ్రెస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఎన్డీఎస్ఏ తన నివేదికలో పేర్కొన్నట్టు బ్యారాజ్‌కు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ద్వారా మొత్తం 20,33,572 ఎకరాలకు సాగునీరందిస్తే, ఒక్క ఎకరాకూ నీళ్లు ఇవ్వలేదని అధికార పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజల జీవధార అయిన కాళేశ్వరంపై నిజానిజాలను ప్రజలకు వివరించాలని బిఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. తద్వారా కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని ఎండగట్టాలని విజ్ఞప్తి చేశారు.

తమ రాజకీయ ప్రయోజనాల కోసం అధికార పార్టీ నేతలు బట్టకాల్చి మీదేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే వారికి ముఖ్యమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అప్పులపైనా, గోదావరిపై ఎపిలో బనకచర్ల ప్రాజెక్టు కట్టడం ద్వారా తెలంగాణకు జరిగే నష్టంపైనా కూడా త్వరలోనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తానని చెప్పారు. ఎపి ప్రభుత్వం గోదావరిపై బనకచర్ల వద్ద 150 టిఎంసి సామర్థ్యంతో బొల్లాపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నదని గుర్తు చేశారు. దీనిపై తెలంగాణ కాంగ్రెస్, బిజెపి నేతలు ఎందుకు మాట్లాడడంలేదని ప్రశ్నించారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు సైతం నోరు విప్పడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాళేశ్వరం కింద ఒక్క ఎకరా పారలేదని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని హరీశ్ ఈ సందర్భంగా విమర్శించారు. 50 వేల ఎకరాలు మాత్రమే సాగయిందంటూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్తున్నారని గుర్తు చేశారు. ఇంకో కాంగ్రెస్ నాయకుడేమో లక్ష ఎకరాలే పారిందంటున్నారనీ, ఇలా ఎవరికి ఇష్టమొచ్చినట్టు వారు, ఒక్కో నాయకుడు ఒక్కో లెక్క చెప్తున్నారని ఎద్దేవా చేశారు. 2014 ముందు వరకు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనే ఉన్నదని, మరి అప్పుడు ఇంత పంట ఎందుకు పండలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం నీళ్లతో ఇప్పటి వరకు నేరుగా 98,570 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించామని తెలిపారు. తెలంగాణ ఏర్పడక ముందు గోదావరి జలాల సద్వినియోగానికి ఎవరూ కషి చేయలేదని అన్నారు. సిబిఐ, ఇడి తరహాలో ఎన్‌డిఎస్ఎ కూడా ఇప్పుడు ఎన్‌డిఎ జేబు సంస్థగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాళేశ్వరం నిర్మాణంపై గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేయటంతోపాటు సిడబ్ల్యుసి పలు సూచనలు చేసిన నేపథ్యంలో ప్రత్యామ్నాయాలను అన్వేషించాల్సి వచ్చిందని హరీశ్ చెప్పారు. ఈ క్రమంలో తన నేతృత్వంలో అప్పటి మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావు సభ్యులుగా సిఎం కెసిఆర్ కేబినెట్ సబ్ కమిటీని నియమించారని గుర్తించారు. అదే విధంగా విశ్రాంత ఇంజినీర్లతో ఒక కమిటీని, ఇరిగేషన్‌శాఖ టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేశారని వివరించారు. అనంతరం ప్రాజెక్టును రీ డిజైన్ చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా నీటి లభ్యతకు పూర్తి భరోసాగా మేడిగడ్డ ఉన్నదంటూ టెక్నికల్ కమిటీ సూచించిందని వివరించారు. దీన్ని రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ కూడా అంగీకరించిందని చెప్పారు. అయితే బొగ్గు గనులు, పట్టణాలు, అటవీ ప్రాంతం నేపథ్యంలో మేడిగడ్డ నుంచి నేరుగా మిడ్‌మానేరుకు జలాలను తరలించలేమని రిటైర్డ్ ఇంజినీర్లు తెలిపారని వివరించారు. అందువల్ల గోదావరి ద్వారా జలాలను ఎల్లంపల్లి వరకు తరలించేందుకు నిర్ణయించామని అన్నారు. ఈ నేపథ్యంలో అన్ని రిపోర్టులపై చర్చించి ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చాలంటూ సబ్‌కమిటీ ప్రభుత్వానికి నివేదికనిచ్చిందని తెలిపారు. దానిపై ఆనాడు సబ్ కమిటీ సభ్యులుగా ఉన్న ప్రస్తుత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా సంతకం పెట్టారని హరీశ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, శాసనమండలిలో బిఆర్ఎస్ నేత మధుసూదనాచారి, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

9న విచారణకు హాజరు కానున్న ప్రభాకర్‌రావు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫోన్ ట్యాపిం గ్ కేసులో ప్రధాన నిందితునిగా ఉన్న ఎస్ఐబి మాజీ ఐజీ ప్రభాకర్‌రావు సోమవారం విచా రణకు హాజరు కానున్నట్టు తెలిసింది. ప్రభాకర్‌రావు తన పాస్‌పోర్టుకు సంబంధించిన సమస్య నుంచి బయటపడి అమెరికా నుంచి బయలుదేరినట్టు సమాచారం. ఆదివారం రాత్రి ఆయన హైదరాబాద్‌కు చేరుకోనున్నారని ఈ కేసు దర్యాప్తు జరుపుతున్న వెస్ట్ జోన్ స్పెషల్ టీం పోలీసులకు సమాచారం అందింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావును విచారించడం ద్వారా అన్ని చిక్కుముడులు విడిపోతాయని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే నలుగురు పోలీస్ అధికారులు.. ప్రణీత్‌రావు, తిరుపతన్న, భుజంగరావు, రాధాకిషన్‌రావులను స్పెషల్ టీం అధికారులు అరెస్ట్ చేసి విచారించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వీరంతా బెయిల్‌పై ఉన్నారు. ఇదే కేసులో మరో నిందితుడు ఐ న్యూస్ సిఇఒ శ్రవణ్‌రావును కూడా స్పెషల్ టీం పోలీసులు రెండు పర్యాయాలు విచారించారు. అతను ముందస్తు బెయిల్‌పై ఉన్నారు.

బీజాపూర్ పోలీస్ కస్టడీలోని మావోయిస్టులను కోర్టులో హాజరుపర్చాలి

- మావోయిస్టుల మరణాలపై సుప్రీం న్యాయమూర్తితో విచారణ చేపట్టాలి
- వామపక్ష పార్టీల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో కొనసాగుతున్న మావోయిస్టు అగ్రనాయకుల హత్యలు అత్యంత అమానుషంగా కొనసాగుతున్నాయని వామపక్ష పార్టీలు విమర్శించాయి. బీజాపూర్ పోలీస్ కస్టడీలోని నాయకుల్ని ఒక్కొక్కర్ని కాల్చిచంపి, ఎన్‌కౌంటర్లుగా పోలీసులు ప్రకటిస్తున్నారని తెలిపాయి. శనివారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో వామపక్ష పార్టీల సమావేశాన్ని నిర్వహించారు. పశ్య పద్మ (సిపిఐ) అధ్యక్షత వహించగా, సిపిఎం నుంచి ఎండీ అబ్బాస్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నుంచి వేములపల్లి వెంకట్రామయ్య, కె గోవర్ధన్, ఎంసిపిఐ(యూ) నుంచి వనం సుధాకర్, ఎస్‌యూసీఐ(సీ) నుంచి తేజ, ఆరెస్పీ నుంచి జానకి రాములు పాల్గొన్నారు. 2004 నాటి శాంతి చర్చల ప్రతినిధి సుధాకర్‌తోపాటు, సురేష్ తదితర ఐదుగురి మరణం అనేక ప్రశ్నల్ని లేవనెత్తుతోందని తెలిపారు. అంతేగాకుండా పది, 20 మంది నాయకులు ఇంకా పోలీసుల కస్టడీలో ఉన్నట్టు, వారందరినీ కూడా ఇదే రీతిలో కాల్చిచంపి ఎన్‌కౌంటర్ మరణాలుగా ప్రకటించే అవకాశం కనిపిస్తున్నదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బీజాపూర్ పోలీస్ కస్టడీలో ఉన్న మావోయిస్టులందర్నీ వెంటనే కోర్టులో హాజరు పర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుధాకర్, సురేష్ తదితరుల హత్యలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని కోరారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపేసి, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలను ప్రారంభించాలని సూచించారు.

భార్లకు భారీగా ధరఖాస్తులు

- అబ్కారీ శాఖకు రూ.36.68 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: రాష్ట్రంలో కొత్త బార్ల కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌కు భారీ స్పందన లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 28 బార్ల కోసం ఇటీవల ఎక్సైజ్ శాఖ ధరఖాస్తులు ఆహ్వానించింది. జిహెచ్ఎంసి పరిధిలోని 24 బార్లకు 3,520 దరఖాస్తులు రాగా, రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో ఉన్న మిగతా బార్లకు 148 ధరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ధరఖాస్తు ఫీజు ద్వారా అబ్కారి శాఖకు రూ.36.68 కోట్ల ఆదాయం సమకూరిందని ఆయన తెలిపారు. ఈ నెల 13న డ్రా పద్ధతి ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. డ్రా నిర్వహించే ప్రాంతాలను త్వరలో ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

గిరిజనుల హామీల్లో ఒక్కటీ అమలు కాలే..

- మైదాన ప్రాంత గిరిజనులకు ఐటిడిఎలు ఏర్పాటు చేయాలి
- జూలకంటి, శ్రీరామ్ నాయక్



రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్ నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల డిక్లరేషన్‌లో గిరిజనులకు ఇచ్చిన 16 రకాల హామీలలో ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేస్తోందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ నాయక్ అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధర్మా నాయక్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి, శ్రీరామ్ నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గిరిజనుల హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సిఎం రేవంత్‌రెడ్డి చేవెళ్ల డిక్లరేషన్ సభలో ప్రకటించారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా అమలు చేయడం లేదని విమర్శించారు. గిరిజన సంక్షేమ శాఖ రాజ్యాంగబద్ధ అధికారాలు కలిగిన 5వ షెడ్యూల్ ప్రాంతంతోపాటు గిరిజనులకు అనేక హక్కులు, చట్టాలు అమల్లో ఉన్నాయన్నారు. గిరిజన ఎమ్మెల్యేలతో కూడిన గిరిజన సలహామండలిని, గిరిజన శాఖ మంత్రిని ఇప్పటివరకు నియమించకుండా అవమానపరుస్తున్నారని అన్నారు. గిరిజన శాఖ సిఎం దగ్గర ఉండటంతో గిరిజనుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉన్నాయన్నారు. ఎస్‌టి కమిషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని మాట తప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు ఎస్‌టి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్కో కార్పొరేషన్‌కు ప్రతియేటా రూ.500 కోట్లు, అంబేద్కర్ అభయహస్తం పథకం ద్వారా ప్రతి ఎస్‌టి కుటుంబానికీ రూ.12 లక్షలు, పోడు భూముల సాగుదారులందరికీ హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మైదాన ప్రాంత గిరిజనుల కోసం ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మహబూబాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో ఐటిడిఎలు ఏర్పాటు చేయాలన్నారు. సమ్మక్క సారలమ్మ గిరిజన గ్రామీణాభివృద్ధి పథకం ద్వారా గూడెం, తండా గ్రామ పంచాయతీలకు ప్రతి యేటా రూ.25 లక్షలు కేటాయించాలని కోరారు. తండా, గ్రామ పంచాయతీలకు రెవెన్యూ హోదా ఇచ్చి, తండాల అభివృద్ధి బోర్డు, ఇండ్లు లేని ఎస్‌టి కుటుంబాలకు ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.6 లక్షలు ఇవ్వాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకున్న ఎస్‌టి అసైన్డ్ భూములను తిరిగి లబ్ధిదారులకు ఇవ్వాలని, ప్రయివేట్ విద్యాసంస్థలతోపాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందే ప్రయివేట్ పరిశ్రమల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. పదో తరగతి నుంచి ఉన్నత విద్య అభ్యసించే గిరిజన విద్యార్థికి లక్ష నుంచి రూ. ఐదు లక్షలు ఇస్తామన్న హామీల అమలుకు తక్షణం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రకటించాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు భూక్యా వీరభద్రం, గూగులోత్ భీమా సాహెబ్, ఎం.బాలు నాయక్, చందు నాయక్, అశ్వినీ, భూక్యా హరి, ఎర్రా నాయక్, అమర్ సింగ్, బాల్యా నాయక్, గోపి, దీప్లా, రాంకుమార్, మహిపాల్ నాయక్, వెంకట్రామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నతమైన వ్యక్తి జయంత్ నర్లికర్

- ఖగోళ శాస్త్రానికి ఎనలేని సేవలు అందించారు
- జయంత్ నర్లికార్ జీవిత విశేషాలు సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

దేశంలో అత్యున్నత పరిశోధనా సంస్థలను నెలకొల్పిన మహోన్నతమైన వ్యక్తిగా జయంత్ నర్లికర్ నిలిచారని, గురుత్వాకర్షణ సిద్ధాంతంతో అంతర్జాతీయ ఖ్యాతి పొంది ఖగోళ శాస్త్రానికి ఎనలేని సేవలు అందించారని పలువురు వక్తలు వివరించారు. డాక్టర్ జయంత్ నర్లికర్ జీవిత విశ్లేషాలపై శనివారం జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు చెలిమల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రముఖ సైన్స్ రైటర్ డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ.. 1938 జులై 19న జన్మించిన డాక్టర్ నర్లికర్ బనారస్ హిందూ యూనివర్సిటీ (బిహెచ్‌యు) క్యాంపస్‌లో తొలి దశ విద్యను అభ్యసించారని తెలిపారు. ఆయన తండ్రి విష్ణు వాసుదేవ నర్లికర్ అదే యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా, గణితశాస్త్ర విభాగాధిపతిగా సేవలందించారని చెప్పారు. ఉన్నత విద్య కోసం కేంబ్రిడ్జ్‌కి వెళ్లిన డాక్టర్ నర్లికర్.. మ్యాథమెటికల్ ట్రిపోస్‌లో వ్రాంగ్లర్ అండ్ టైసన్ పతక విజేతగా నిలిచారన్నారు. బ్రిటన్‌లో ఉన్నప్పుడే తన డాక్టోరల్ అడ్వైజర్ ఫ్రెడ్ హూయల్‌తోపాటు ప్రఖ్యాత శాస్త్రవేత్తలతో కలిసి ప్రఖ్యాత హూయల్-నార్లికర్ గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని రూపొందించి 1972లో భారత్‌కు తిరిగొచ్చి టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్‌లో చేరారని వివరించారు.

ఉస్మానియా యూనివర్సిటీ అస్ట్రోనో డాక్టర్ జె రుక్మిణి మాట్లాడుతూ.. డాక్టర్ నర్లికర్ ప్రభావం విద్యారంగానికి మించి విస్తరించిందన్నారు. ఆయన ఒక ఉద్వేగఫలితమైన సైన్స్ కమ్యూనికేషన్ కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఇంగ్లీష్ కమ్యూనికేషన్‌లో అనేక పుస్తకాలు, వ్యాసాలు రచించారన్నారు. ఆకర్షణీయమైన సైన్స్ ఫిక్షన్ రచనలు రేడియో టెలివిజన్‌లో కనిపించడం వల్ల భారతీయుల ఇండ్లలో శాస్త్రీయ ఆలోచన వచ్చిందని, ప్రజాశాస్త్ర విద్య పట్ల ఆయన నిబద్ధతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని అన్నారు. 1996లో ఆయన సైన్స్ కమ్యూనికేషన్ కోసం యునెస్కో కళింగ బహుమతిని అందుకున్నారని తెలిపారు. డాక్టర్ కె.శ్రీరాము మాట్లాడుతూ.. జయంత్ నర్లికర్ ఫ్రెడ్ హోయల్‌తో కలిసి హెూయల్ నర్లికర సిద్ధాంతమని పిలవబడే ఒక కన్ఫార్మల్ గురుత్వాకర్షణ నమూనాను ప్రతిపాదించారని గుర్తు చేశారు.

వెల్లోన్ కాస్మాలజిస్ట్ డాక్టర్ ఎమ్ఎస్ సీమ పురాన్‌చంద్ మాట్లాడుతూ.. జయంత్ నర్లికర్ కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ఫెడ్ పోయెని అనే సైంటిస్ట్ వద్ద పనిచేశారని తెలిపారు. ఆయనకు హిందుస్థానీ సంగీతం అంటే మక్కువ అని, ఐయూసీకేఏ సెంట్రల్ యూనివర్సిటీలో ఆస్ట్రానమీ ఆస్ట్రో ఫిజిక్స్‌ను స్థాపించి డైరెక్టర్‌గా పని చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కమ్యూనికేషన్ సబ్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ రామచంద్రయ్య, జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి రాజా కమిటీ సభ్యులు ప్రొఫెసర్ బి.యన్.రెడ్డి, ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి 2025 యెజ్డీ అడ్వెంచర్

న్యూఢిల్లీ : జావా యెజ్డీ మోటార్‌సైకిల్ భారత మార్కెట్లోకి తన కొత్త 2025 యెజ్డీ అడ్వెంచర్‌ను విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.2.15 లక్షలుగా నిర్ణయించింది. ఇంతక్రితం వర్షన్ కంటే రూ.5,000 ఎక్కువ ధరను ప్రకటించింది. 334 సిసి ఇంజిన్‌ను అమర్చింది.

ఇన్ఫోసిస్‌కు రూ.32వేల కోట్ల జిఎస్‌టి ఉపశమనం..!

బెంగళూరు : ప్రముఖ ఐటి కంపెనీ ఇన్ఫోసిస్‌కు ఇదివరకు జారీ చేసిన రూ.32,403 కోట్ల జిఎస్‌టి నోటీసుకు సంబంధించి డైరెక్టర్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్ ఆ సంస్థకు ఉపశమనం కలిగించింది. 2018-19 నుంచి 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ప్రీ షోకాజ్ నోటీసు ప్రొసీడింగ్స్‌ను మూసివేస్తున్నట్లు డిజిజిఐ నుంచి తమకు సమాచారం అందినట్లు ఇన్ఫోసిస్ తన రెగ్యూలేటరీ ఫైలింగ్‌లో తెలిపింది.

2017 నుంచి 2022 మధ్య ఇన్ఫోసిస్ విదేశీ శాఖల్లో జరిగిన వ్యయాలకు సంబంధించి రూ.32,403 కోట్ల జిఎస్‌టి నోటీసును 2024 జులైలో డిజిజిఐ జారీ చేసింది. దీనిపై వివరణ ఇవ్వడంతో డిజిజిఐ తన నోటీసులను రద్దు చేసినట్లు తెలుస్తోంది.

వడ్డీ రేట్లు తగ్గిస్తోన్న బ్యాంక్‌లు

న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ కీలక రెపోరేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన నేపథ్యంలో బ్యాంక్‌లు రుణ ఖాతాదారులకు వడ్డీ రేట్లను తగ్గిస్తున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి), ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా (బిఒఐ), కరూర్ వైశ్యా బ్యాంక్ (కెవిబి) వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. పిఎన్‌బి రుణాలపై రెపో లింక్డ్ లెండింగ్ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్)ను 8.85 శాతం నుంచి 8.35 శాతానికి కోత పెడుతోన్నట్లు వెల్లడించింది. కొత్త వడ్డీ రేట్లు జూన్ 9 నుంచి అమల్లోకి రానున్నాయని తెలిపింది. యూకో బ్యాంక్ అన్ని రకాల కాలపరిమితి రుణాలపై మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు (ఎంసిఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్లు జూన్ 10 నుంచి తగ్గించనున్నట్లు పేర్కొంది. ఒక్క పూట నుంచి ఏడాది కాలపరిమితిపై వడ్డీ రేట్లు 8.15 శాతం నుంచి 9 శాతం వరకు నిర్ణయించింది. కరూర్ వైశ్యా బ్యాంక్ ఆరు నెలల ఎంసిఎల్ఆర్‌ను 9.90 శాతం నుంచి 9.80 శాతంగా, ఏడాది కాలపరిమితి ఎంసిఎల్ఆర్‌ను 10 శాతం నుంచి 9.80 శాతానికి ఈ నెల 7 నుంచి కుదించినట్లు వెల్లడించింది. ఇండియన్ బ్యాంక్ రుణాలపై వడ్డీ రేట్లను 8.70 శాతం నుంచి 8.20 శాతానికి కోత పెట్టింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా 8.85 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గించింది. జూన్ 6 నుంచే కొత్త రేట్లను అమలు చేస్తున్నట్లు ఇరు బ్యాంక్‌లు వేరువేరుగా ప్రకటించడం విశేషం. ఆర్‌బిఐ ఎంపిసి భేటీలో రెపోరేటును తాజాగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించి తద్వారా 5.50 శాతానికి చేర్చింది. ఇంతక్రితం ఫిబ్రవరిలో 25 బేసిస్ పాయింట్లు, ఏప్రిల్ లో 25 బేసిస్ పాయింట్లు చొప్పున వడ్డీ రేట్లను తగ్గించిన విషయం తెలిసిందే.

టాటా మోటార్స్ ఉచిత మాన్‌సూన్ చెకప్ క్యాంప్

హైదరాబాద్ : ప్రముఖ ఆటోమోటివ్ కంపెనీ టాటా మోటార్స్ తన కస్టమర్ల కోసం దేశవ్యాప్తంగా మాన్‌సూన్ చెక్ అప్ క్యాంప్‌ను ప్రారంభించినట్లుగా ప్రకటించింది. 500 నగరాల్లోని 1,090 కి పైగా అధీకృత వర్క్‌షాప్‌ల మద్దతుతో దీన్ని జూన్ 6 నుండి జూన్ 20 వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. ఇందులో వినియోగదారులు ఉచిత సమగ్ర వాహన తనిఖీని పొందవచ్చని తెలిపింది. కార్ టాప్ వాష్, ఒరిజినల్ స్పేర్ పార్ట్స్, ఇంజిన్ ఆయిల్, యాక్సెసరీస్, ఎక్స్‌టెండెడ్ వారంటీ మరియు లేబర్ ఛార్జీలపై ప్రత్యేక తగ్గింపులను అందిస్తున్నట్లు వెల్లడించింది.